నేటి మ్యాచ్
న్యూజిలాండ్ X దక్షిణాఫ్రికా
మ. 2.00 నుంచి
వేదిక: పుణె

హాంగ్జౌ(చైనా) వేదికగా ఇటీవలే ముగిసిన ప్రతిష్ఠాత్మక ఆసియాగేమ్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన యువ అథ్లెట్ అగసర నందినికి తగిన గుర్తింపు లభించింది. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి నవీన్ నికోలస్..మంగళవారం నందినికి రూ.5లక్షల చెక్ అందించారు.

హైదరాబాద్‌లో రేసింగ్ లీగ్ రద్దు

ఎన్నికల కోడ్‌తో అవాంతరం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ ఎల్) పోటీలకు ఎన్నికల కోడ్‌తో అవాంతరం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4, 5 తేదీల్లో ఐఆర్ఎల్ తొలి అంచె పోటీలు హైదరాబాద్ హుసేన్ సాగర్ తీరప్రాంతంలో జరుగాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ దృష్ట్యా రేసింగ్ లీగ్‌కు పోలీస్ భద్రత ఏర్పాట్లలో ఇబ్బందులు తలెత్తే అవకాశం నెలకొంది. ఈ నేపథ్యంలో రేసింగ్ లీగ్‌ను హైదరాబాద్ నుంచి చెన్నైకి మారుస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఇప్పటికే రేసింగ్ లీగ్ కోసం టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు త్వరలోనే డబ్బులు రీఫండ్ చేస్తామని వారు స్పష్టం చేశారు. వచ్చే నెల 10వ తేదీ వరకు నాలుగు అంచెల్లో ఫార్ములా-4 రేసింగ్ పోటీలు జరుగనున్నాయి.

చాంప్స్ హంసిని, అవని

ముగిసిన ఆలిండియా బ్యాడ్మింటన్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆలిండియా సబ్‌జూనియర్ అండర్-13 బ్యాడ్మింటన్ టోర్నీలో హంసిని చదరం, అవని విక్రమ్(డబుల్స్) విజేతలుగా నిలిచారు. మంగళవారం జరిగిన బాలికల సింగిల్స్ ఫైనల్లో హంసిని 21-16, 22-20తో అవని విక్రమపై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. బాలుర తుది పోరులో ఆదిత్య 19-21, 21-16, 21-10తో తన్మయ్ వర్మపై గెలిచాడు. బాలుర డబుల్స్‌లో దుర్గ ఉదయ్, శ్రీచేతన్ జోడీ 17-21, 21-12, 22-20తో మయూరేశ్, విశ్వజిత్ ద్వయంపై గెలిచింది. బాలికల డబుల్స్‌లో అవని, లక్ష్మి సాయి జోడీ టైటిల్ దక్కించుకుంది. విజేతలకు బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ట్రోఫీలు అందజేశారు. పోటీల ముగింపు కార్యక్రమానికి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరీనాథ్, స్టార్ షట్లర్ ప్రణయ్, రంగారెడ్డి బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, యూపీఎన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ టీ20పై నీలినీడలు!

భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్ వేదిక మారే చాన్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రపంచకప్ ముగిసిన తర్వాత భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఖరారైంది. షెడ్యూల్ ప్రకారం ఇరు జట్ల మధ్య ఈ నెల 23న విశాఖపట్నంలో తొలి మ్యాచ్‌తో సిరీస్‌కు తెరలేవనుండగా, డిసెంబర్ 3న ఆఖరి మ్యాచ్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే సరిగ్గా అదే రోజు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల కానుండటంతో మ్యాచ్‌కు పూర్తి స్థాయి భద్రత కల్పించలేమని పోలీసులు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) లేఖ ద్వారా బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. బీసీసీఐ నుంచి ప్రతిస్పందన ఇంకా రావాల్సి ఉంది. ఒకవేళ నిర్వహణకు అవకాశం లేకపోతే హైదరాబాద్ నుంచి వేరే వేదికకు మ్యాచ్ మార్చే చాన్స్ ఉంది.

వందన@300

న్యూఢిల్లీ: భారత హాకీ ప్లేయర్ వందనా కటారియా అరుదైన ఘనత సొంతం చేసుకుంది. సుదీర్ఘ దేశ హాకీ చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించుకుంది. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన వందన..అంచెలంచెలుగా ఎదుగుతూ భారత్ తరపున 300 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. ఈ అరుదైన రికార్డు అందుకున్న తొలి భారత హాకీ ప్లేయర్‌గా వందన నిలిచింది. ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా మంగళవారం జపాన్‌తో మ్యాచ్ ద్వారా వందన ఈ మార్క్ అందుకుంది. 2011లో జాతీయ జట్టులోకి అరంగేట్రం చేసిన వందన.. అనతి కాలంలోనే కీలక ప్లేయర్‌గా ఎదిగింది.

శ్రియాంకకు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ : కొరియాలో జరుగుతున్న ఆసియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 50మీ. రైఫిల్3 పొజిషన్ పోటీలో నాలుగో స్థానంలో నిలవడంద్వారా భారత యువ మహిళా షూటర్ శ్రియాంక సదంగి పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మంగళవారంనాటి పోటీలో శ్రియాంక 440.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

90మీ. మార్క్ అధిగమిస్తా

న్యూఢిల్లీ : ఎలాగైనా 90మీ. దూరాన్ని అధిగమిస్తానని ఒలింపిక్, ప్రపంచ జావెలిన్ చాంపియన్ నీరజ్ చోప్రా విశ్వాసం వ్యక్తంచేశాడు. సాంకేతిక లోపాలను సవరించుకుని వచ్చే యేడాది 90మీ. లక్ష్యాన్ని చేరుకుంటానని అన్నాడు. ముఖ్యంగా కాళ్లు మడతపడే అంశంపై దృష్టి సారించానని, ఆ లోపాన్ని సవరించుకుంటే తన లక్ష్యాన్ని అధిగమించడం కష్టంకాబోదన్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన నీరజ్ ఈ యేడాది ఆరంభంలో ప్రపంచ చాంపియన్‌గానూ అవతరించాడు. ఇప్పటికీ తనలోని అత్యుత్తమ ప్రతిభ వెలికి రాలేదని 25 ఏళ్ల నీరజ్ అన్నాడు.

'బాలన్ డి ఓర్' విజేత మెస్సి

పారిస్ : అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాలర్ లయోనల్ మెస్సి రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ప్రతిష్ఠాత్మక 'బాలన్ డి ఓర్' అవార్డును గెలుచుకున్నాడు. గత యేడాది ఫిఫా ప్రపంచకప్‌ను అర్జెంటీనా గెలుచుకోవడంలో ముఖ్యపాత్ర పోషించిన మెస్సిని ఈ అవార్డు వరించింది. మాంచెస్టర్ సిటీ క్లబ్‌కు చెందిన ఎర్లింగ్ హాలండ్, పిఎస్‌జి క్లబ్ సహచరుడు, ఫ్రాన్స్ స్టార్ స్ట్రయికర్ కిలియన్ ఎంబప్పెతో పోటీపడి మెస్సి ఈ అవార్డును దక్కించుకున్నాడు.

ఓదార్పు గెలుపు!

బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ విజయం

రాణించిన షాహీన్, ఫఖర్ జమాన్

రోహిత్ సేన చేతిలో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్.. నాలుగు మ్యాచ్‌ల తర్వాత తేరుకుంది. తమకంటే బలహీన ప్రత్యర్థి అయిన బంగ్లాదేశ్‌పై విజయంతో రెండు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. బౌలర్లు సమిష్టిగా సత్తాచాటి బంగ్లా బ్యాటర్లను కట్టడి చేయగా.. ఓపెనర్లు రాణించడంతో స్వల్ప లక్ష్యాన్ని పాక్ వంద కంటే ఎక్కువ బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఈ గెలుపుతో పాక్ సెమీస్ రేసులో సజీవంగా ఉండటం పక్కన పెడితే.. ఆ జట్టుపై ఉన్న కొండంత ఒత్తిడిలో కాస్తంతైన తగ్గి ఉంటుందనడం వాస్తవం!

కోల్‌కతా: వరుస పరాజయాలతో సతమతమవుతున్న పాకిస్థాన్ ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. వన్డే ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా చేతిలో ఓటమి తర్వాత లయ కోల్పోయిన పాక్.. నాలుగు ఓటముల అనంతరం ఎట్టకేలకు బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన పోరులో పాకిస్థాన్ 7 వికెట్ల తేడాతో బంగ్లాను మట్టికరిపించింది. మెగాటోర్నీలో ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్‌కు ఇది మూడో విజయం కాగా.. ఆరు పాయింట్లు ఖాతాలో వేసుకున్న ఆ జట్టు పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మరోవైపు బంగ్లాదేశ్ ఏడు మ్యాచ్‌ల్లో ఆరో పరాజయం మూటగట్టుకొని నిరాశ పరిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 45.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. మహ్ముదుల్లా (56), లిటన్ దాస్ (45), కెప్టెన్ షకీబ్ (43) రాణించగా.. తన్జీద్ (0), నజ్ముల్ (4), ముష్ఫికర్ (5), తౌహిద్ (7) విఫలమయ్యారు. పాకిస్థాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది, మహమ్మద్ వసీమ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 32.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫఖర్ జమాన్ (74 బంతుల్లో 81; 3 ఫోర్లు, 7 సిక్సర్లు), అబ్దుల్లా షఫీఖ్ (68; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీలతో రాణించారు. బంగ్లా బౌలర్లలో మెహదీ హసన్ మిరాజ్ మూడు వికెట్లు తీశాడు. ఫఖర్ జమాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

పాక్ సెమీస్ చేరాలంటే!

వరల్డ్‌కప్‌లో ఏడు మ్యాచ్‌లాడి మూడింట నెగ్గిన పాకిస్థాన్ సెమీస్ చేరాలంటే మిగిలిన రెండు (న్యూజిలాండ్, ఇంగ్లండ్‌తో) మ్యాచ్‌ల్లో భారీ విజయాలు సాధించడంతో పాటు.. ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సి ఉంది.

- ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లలో ఒకటి అఫ్గానిస్థాన్‌పై విజయం సాధించాలి.
- దక్షిణాఫ్రికా, శ్రీలంక చేతిలో న్యూజిలాండ్ చిత్తుగా ఓడాలి.
- శ్రీలంక, నెదర్లాండ్స్‌పై టీమ్ ఇండియా విజయాలు సాధించాలి.

ఇవన్నీ సాధ్య పడితే పాకిస్థాన్ 10 పాయింట్లతో భారత్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తర్వాత నాలుగో స్థానంతో నాకౌట్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 45.1 ఓవర్లలో 204 ఆలౌట్ (మహ్ముదుల్లా 56, లిటన్ దాస్ 45; షాహీన్ 3/23, వసీమ్ 3/31), **పాకిస్థాన్:** 32.3 ఓవర్లలో 205/3 (ఫఖర్ 81, అబ్దుల్లా 68; మెహదీ 3/60).

1 వన్డేల్లో అత్యంత వేగంగా (51 మ్యాచ్‌ల్లో) 100 వికెట్లు తీసిన పేసర్‌గా షాహీన్ షా అఫ్రిది రికార్డుల్లోకెక్కాడు. మిషెల్ స్టార్క్ (52 మ్యాచ్‌ల్లో) రెండో స్థానానికి పరిమితమయ్యాడు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్	6	6	0	+1.40	12
దక్షిణాఫ్రికా	6	5	1	+2.03	10
న్యూజిలాండ్	6	4	2	+1.23	8
ఆస్ట్రేలియా	6	4	2	+0.97	8
పాకిస్థాన్	7	3	4	-0.02	6
అఫ్గానిస్థాన్	6	3	3	-0.71	6
శ్రీలంక	6	2	4	-0.27	4
నెదర్లాండ్స్	6	2	4	-1.27	4
బంగ్లాదేశ్	7	1	6	-1.44	2
ఇంగ్లండ్	6	1	5	-1.65	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

ఫఖర్ జమాన్ (81)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.